క్లుప్తంగా

గుంటూరు గూగుల్స్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ



నెహ్రూనగర్: జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ గుంటూరు గూగుల్స్ ఆధ్వర్యంలో శుక్రవారం గాంధీ పార్కు వద్ద బాటసారులు, వాహనదారులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రెసిడెంట్ మేకల చాముండేశ్వరి మాట్లాడుతూ గత తొమ్మిదేళ్లుగా గుంటూరు గూగుల్స్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని గత 59 రోజులుగా మజ్జిగ పంపిణీ చేస్తున్నామని, 60వ రోజైన శుక్రవారం 500 లీటర్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు సిమ్రాన్ కౌర్, నరసింహం, కార్తీక్, దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ బాలుర హైస్కూలు హెచ్‌ఎంగా ప్రసాద్




గుంటూరు ఎడ్యుకేషన్: పాత బస్టాండ్ సెంటర్లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా ఎస్వీఆర్ ప్రసాద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. గురజాలలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పని చేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు శుక్రవారం ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసీం, ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



పట్నంబజారు: తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా శుక్రవారం బ్రహ్మానంద రెడ్డి స్టేడియం సమీపంలోని ఆయన కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్) చెక్కుల్ని లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టాల్లో ఉన్న పేదల్ని ఆదుకునేందుకు సీఎం వై.ఎస్.జగన్ ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం అందజేయడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన



పాత గుంటూరు: అమరావతి రోడ్డు ఆంజనేయపేటలో పురాతన శ్రీ వీరాంజనేయస్వామి దేవాలయం పునర్నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. బద్దిగం కోటిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అర్చకులు పూజలు నిర్వహించి మహా ద్వారం నిలిపారు. ఆలయ పునర్నిర్మాణానికి భక్తులు సహాయ, సహకారాలు అందించాలని కోటిరెడ్డి కోరారు. కార్యక్రమంలో వంగల వలి వీరారెడ్డి, పులగం శివారెడ్డి, ముప్పా చంద్రశేఖరరెడ్డి, కారసాని బాబుల్‌రెడ్డి, కత్తి వీరారెడ్డి, రాఘవయ్య పాల్గొన్నారు.

బ్యాంకులో నగదు విత్‌డ్రాపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: రెండు వేర్వేరు ఘటనల్లో బ్యాంకు అకౌంట్‌లో నగదు విత్‌డ్రా అయిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏటీ అగ్రహారంలో నివాసం ఉండే తోట నాగరాజుకు యూనియన్ బ్యాంకులో అకౌంట్ ఉంది. మే 31 నుంచి వరుసగా ఐదు రోజులు అతని ప్రమేయం లేకుండా రూ.50వేలు విత్‌డ్రా అయ్యాయి. బాధితుడి బ్యాంకులో విచారించగా ఆధార్ బయోమెట్రిక్ ఆధారంగా డబ్బులు డ్రా అయినట్లు చెప్పారు. బాధితుడు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. హనుమాన్‌నగర్‌కు చెందిన కె.శ్రీనివాస్‌కు యూనియన్ బ్యాంకులో అకౌంట్ ఉంది. రెండు విడతలుగా అతని అకౌంట్‌లోని రూ.10,600 విత్‌డ్రా అయ్యాయి. దీంతో శ్రీనివాసరావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు సినీ సంగీత విభావరి

పాత గుంటూరు: అమరావతి రోడ్డు అన్నదాన సమాజం ఆడిటోరియంలో శనివారం సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు ఆర్‌ఎస్ ఈవెంట్స్ వ్యవస్థాపకురాలు మునిపల్లె రమణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో ఎన్టీఆర్, ఏఎన్‌ఆర్ నటించిన చిత్రాల్లోని పాటల్ని గాయకులు ఆలపిస్తారని పేర్కొన్నారు. సంగీత అభిమానులు పాల్గొనాలని ఆమె కోరారు.

పన్ను బకాయిదార్లకు నోటీసులు ఇవ్వండి

రెవెన్యూ అధికారులకు కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశం



అధికారులతో సమావేశమైన కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: ఆస్తి పన్నుపై వడ్డీ లేకుండా చెల్లించడానికి ఈ నెలాఖరు వరకే గడువు ఉన్నందున, బకాయిదార్లకు డిమాండ్ నోటీసులు ఇవ్వాలని నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. వార్డు సచివాలయాల వారీగా అసెస్‌మెంట్లకు ఇచ్చిన డిమాండ్ నోటీసులకు అకనాడ్జెమెంట్లు కూడా తీసుకోవాలని చెప్పారు. రెవెన్యూ అధికారులతో శుక్రవారం పన్ను వసూళ్లు, పట్టణ ప్రణాళిక అధికారులతో రోడ్ల విస్తరణ పనులపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రస్తుత అర్ధ సంవత్సరానికి పన్ను బకాయిలపై వచ్చే నెల నుంచి వడ్డీ కలుస్తుందని, ఈ విషయాన్ని బకాయిదార్లకు తెలియజేయాలని అడ్మిన్ కార్యదర్శుల్ని ఆదేశించారు. వార్డ్ సచివాలయాల వారీగా బకాయిదార్లకు డిమాండ్ నోటీసులు ఇవ్వాలని, మైక్, మెసేజ్‌ల ద్వారా సమాచారం అందించాలని చెప్పారు. క్షేత్రస్థాయిలో అడ్మిన్ కార్యదర్శులు పన్ను వసూళ్లలో పూర్తి స్థాయిలో విధుల్లో ఉండాలని, ప్రతి రోజు సచివాలయం వారీగా నివేదిక ఇవ్వాలని తెలిపారు. అనంతరం పట్టణ ప్రణాళిక అధికారులతో సమావేశమయ్యారు. రోడ్ల విస్తరణ పనులు వెంటనే పూర్తి చేయాలని చెప్పారు. పనులు జరిగిన ప్రాంతాల్లో నష్ట పరిహారం లేదా టీడీఆర్ బాండ్ల జారీకి వేగంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విస్తరణ పనులు జరుగుతున్న ప్రాంతాల్లో ఇంజినీరింగ్ అధికారుల్ని సమన్వయం చేసుకుంటూ డ్రెయిన్ నిర్మాణాలకు సహకరించాలని తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు బాలాజీ, బాష, సాంబశివరావు, రవి కుమార్, రెహ్మాన్, డెప్యూటీ సిటీప్లానర్ కోటయ్య, ఏసీపీలు బాబూరావు, అజయ్ కుమార్ పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ ఉద్యోగులకు క్రీడా పోటీలు

నగరపాలక సంస్థ ఉద్యోగులకు క్రీడా పోటీలు నిర్వహించడానికి చర్యలు తీసుకుంటామని కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. వ్యక్తిగత సెలవు అనంతరం బాధ్యతలు తీసుకున్న ఆమెను విభాగాధిపతులు, అధికారులు, సిబ్బంది, మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు మర్యాదపూర్వకంగా చాంబర్‌లో కలసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా క్రీడా పోటీల నిర్వహణ విషయాన్ని కమిషనర్ దృష్టికి తీసుకవచ్చారు. దీంతో ఆమె షెడ్యూల్ సిద్ధం చేయాలని డెప్యూటీ కమిషనర్‌ని ఆదేశించారు. కార్యక్రమంలో డెప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య, ఎంహెచ్‌వో డాక్టర్ భాను ప్రకాష్, డీసీపీ కోటయ్య, మేనేజర్ శివన్నారాయణ, ఏసీపీలు, ఈఈలు, డీఈఈలు, రెవెన్యూ అధికారులు, మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు పోలేశ్వరరావు పాల్గొన్నారు.

బ్రింద హాస్పిటల్‌తో వరల్డ్ బ్రెయిన్ సొసైటీ ఒప్పందం

- బ్రెయిన్‌పై పరిశోధన చేసేందుకు గుంటూరు హాస్పటల్‌తో ఒప్పందం చేసుకున్న అంతర్జాతీయ సంస్థ
- వినూత్న రీతిలో బ్రెయిన్ సర్జరీలు చేస్తున్న బ్రింద హాస్పటల్



ప్రొఫెసర్ కె.ఎస్.జగన్నాథరావును సన్మానిస్తున్న డాక్టర్ భవనం హనుమ శ్రీనివాసరెడ్డి

గుంటూరుమెడికల్: ఇంటర్నేషనల్ బ్రెయిన్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ సభ్యుడు ప్రొఫెసర్ కె.ఎస్.జగన్నాథరావు శుక్రవారం గుంటూరులోని బ్రింద హాస్పిటల్‌తో ఒప్పందం చేసుకునేందుకు ముందుకు వచ్చారు. అంతర్జాతీయంగా బ్రెయిన్‌పై పరిశోధనలు చేస్తున్న సంస్థలో భారతదేశం మొత్తానికి ఒకే ఒక సభ్యుడిగా కె.ఎస్.జగన్నాథరావు ఉన్నారు. పనామా దేశం నేషనల్ సైన్స్ సిస్టం విశిష్ట ప్రొఫెసర్‌గా, యూఎస్ఏ హోస్టన్‌లోని యూటీహెచ్‌ఎస్‌లో అధ్యాపకుడిగా ఈయన విధులు నిర్వహిస్తున్నారు. బ్రింద హాస్పిటల్ అధినేత, సీనియర్ న్యూరో సర్జన్ డాక్టర్ భవనం హనుమశ్రీనివాసరెడ్డి వినూత్నరీతిలో చాలెంజింగ్ కేసులకు బ్రెయిన్ సర్జరీలు చేస్తున్న విషయాన్ని తెలుసుకుని సదరు హాస్పిటల్‌తో పరిశోధనలపై ఒప్పందం చేసుకునేందుకు ముందుకు వచ్చామని కె.ఎస్.జగన్నాథరావు తెలిపారు. డాక్టర్ హనుమ శ్రీనివాసరెడ్డి ఈనెల 3న పార్కిన్ సన్స్ (వణుకుడు జబ్బు)తో బాధపడుతున్న ఓ మహిళకు సుమారు 13 గంటల సేపు అరుదైన ఆపరేషన్ చేసి బ్రెయిన్‌లో చిప్స్ అమర్చి వణుకుడు జబ్బుకు చెక్ పెట్టారు. సదరు విషయం మీడియా ద్వారా వెలుగులోకి వచ్చింది. డాక్టర్ భవనం హనుమ శ్రీనివాసరెడ్డి గతంలో బాహుబలి సినిమా ల్యాప్‌ట్యాప్‌లో రోగికి చూపిస్తూ రోగి మెలకువగా ఉండగానే అరుదైన శస్త్ర చికిత్స చేసి రికార్డు సృష్టించారు. గుంటూరు జీజీహెచ్ న్యూరోసర్జరీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న సమయంలో ఎపిలెప్సి రోగికి లైవ్ సర్జరీ చేసి మూర్ఛను నయం చేశారు. ఆ విషయాలు మీడియా ద్వారా వెలుగులోకి రావడంతో బ్రెయిన్‌పై వినూత్నంగా, పరిశోధనా పరంగా ఆపరేషన్లు చేస్తున్న ఆసుపత్రితో తాము ఒప్పందం చేసుకుంటున్నట్లు వెల్లడించారు. అంతర్జాతీయ స్థాయిలో దేశ న్యూరోసర్జరీ విభాగానికి ఖ్యాతి తీసుకొస్తున్నందుకు డాక్టర్ హనుమ శ్రీనివాసరెడ్డికి అభినందనలు తెలిపారు. ప్రొఫెసర్ కె.ఎస్.జగన్నాథరావును డాక్టర్ హనుమ శ్రీనివాసరెడ్డి సత్కరించారు.

ప్రాంతీయ గ్రంథాలయంలో మౌలిక వసతుల కల్పనకు కృషి



గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న మందపాటి శేషగిరిరావు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయంలో పాఠకులకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు తెలిపారు.ఏసీ కళాశాల వద్ద ఉన్న ప్రాంతీయ గ్రంథాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. భవన సామర్థ్యం, పటిష్టతను పరిశీలించారు. రాష్ట్రంలో విద్యావ్యవస్థను ఉన్నతంగా తీర్చిదిద్దిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఆలోచనా విధానానికి అనుగుణంగా రాష్ట్రవ్యాప్తంగా గ్రంథాలయాల్ని అభివృద్ధి పర్చామని చెప్పారు. గుంటూరు నగరంలో ఘన చరిత్ర కలిగిన ప్రాంతీయ గ్రంథాలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పర్చేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఆయన వెంట రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్ శామ్యూల్, పౌర గ్రంథాలయ శాఖ డెప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి, గెజిటెడ్ గ్రంథ పాలకుడు ఎస్.వెంకటేశ్వరరావు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గుంటూరు ఈస్ట్: నగరంలో పలు కాలనీల్లో విద్యుత్ లైనుల మరమ్మతుల రీత్యా శనివారం సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాసబాబు శుక్రవారం తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో ఉదయం 7 నుంచి, మరికొన్ని ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి విద్యుత్ ఉండదని చెప్పారు. మరమ్మతులు పూర్తయితే కొన్ని ప్రాంతాల్లో ఉదయం 10 గంటలకు, మరికొన్ని ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 గంటలకు సరఫరాను పునరుద్ధరిస్తామని పేర్కొన్నారు. వినియోగదారులంతా సహకరించాలని ఆయన కోరారు.

ఆరోగ్య మిత్రాలకు ఉద్యోగ భద్రత కల్పించాలి



వెంకట్రామిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న మురికిపూడి దేవపాల్, మాచర్ల బుజ్జి

గుంటూరు మెడికల్: డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో పని చేస్తున్న ఆరోగ్య మిత్రాల్ని కాంట్రాక్టు సిబ్బందిగా మార్చి ఉద్యోగ భద్రత కల్పించాలని పలువురు ఆరోగ్యమిత్రాలు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాకర్ల వెంకట్రామిరెడ్డిని తాడేపల్లిలో కలసి వినతి పత్రం అందజేశారు. ఆరోగ్యమిత్రాల సమస్యల్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. వెంకట్రామిరెడ్డిని కలసిన వారిలో మేడ్ రాష్ట్ర అధ్యక్షుడు మురికిపూడి దేవపాల్, ఆంధ్రప్రదేశ్ దళిత ఎంప్లాయీస్ అసోసియేషన్ నేతలు, ఎస్సీ, ఎస్టీ ఆరోగ్య మిత్రాల రాష్ట్ర అధ్యక్షుడు మాచర్ల బుజ్జి, ప్రధాన కార్యదర్శి రాంబాబు, రాష్ట్ర కార్యదర్శి కిరణ్‌కుమార్ ఉన్నారు.

రేపు పునీత అంథోని 33వ వార్షికోత్సవం



వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఫాదర్ రాజారెడ్డి, కౌన్సిల్ సభ్యులు

నెహ్రూనగర్: నగరంపాలెంలోని పునీత అంథోని పుణ్యక్షేత్రంలో 33వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించనున్నట్లు విచారణ గురువు, రెక్టార్ ఫాదర్ పి.రాజారెడ్డి తెలియజేశారు. పుణ్యక్షేత్రంలో శుక్రవారం వార్షికోత్సవం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ ఆదివారం పుణ్యక్షేత్రం ఆవరణలో వేడుకల్ని ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఆ రోజు సాయంత్రం 5.30గంటలకు దివ్యబలి పూజ ఉంటుందన్నారు. ముఖ్య ప్రసంగికులుగా రెవరెండ్ ఫాదర్ బెన్ని హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో సహాయ గురువులు ఫాదర్ ఉప్పుటూరి రవీంద్ర, కౌన్సిల్ సభ్యులు ఎస్.జి.ప్రకాశరావు, జేజే సుధీర్‌బాబు, వై. సుదర్శన్, జి. దేవసహాయం, ఎం. ప్రకాశరావు, దేవయ్య, మరియదాసు పాల్గొన్నారు.

నేడు, రేపు గ్రూప్-2 సిలబస్‌పై అవగాహన సదస్సు

గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీపీఎస్సీ గ్రూప్-2 సిలబస్‌లో మార్పులపై రాష్ట్రస్థాయి ఫ్యాకల్టీ ఆధ్వర్యంలో శని, ఆదివారాల్లో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు జయం స్టడీ సర్కిల్ డైరెక్టర్ కె.రాజకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అమరావతి రోడ్డులో భారత్‌పేట ఒకటో లైనులోని సంస్థ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు 10 సబ్జెక్టుల్లో పది మంది అధ్యాపకులతో పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరు కానున్న ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి జయం స్టడీ సర్కిల్ యాప్‌ను ఆవిష్కరిస్తారని తెలిపారు. గ్రూప్-2 పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. వివరాలకు 63094 93634 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

కర్రసాము పోటీల్లో సత్తా చాటిన పాటిబండ్ల స్కూలు విద్యార్థులు



విద్యార్థినులను అభినందిస్తున్న శివాజీ, విష్ణువర్ధన్, వరప్రసాదరావు, కృష్ణవేణి

గుంటూరు ఎడ్యుకేషన్: కోయంబత్తూరులో గత నెల 21న జరిగిన 4వ జాతీయస్థాయి (సిలంబం) కర్రసాము పోటీల్లో శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ స్కూలు విద్యార్థులు సత్తా చాటారని ఆ పాఠశాల గౌరవాధ్యక్షుడు డాక్టర్ యలమంచిలి శివాజీ పేర్కొన్నారు. లక్ష్మీపురం మెయిన్‌రోడ్డులోని పాఠశాలలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ మాట్లాడుతూ అండర్-12 కేటగిరీలో బుస్సాపురం హర్షవర్ధని, అండర్-10 కేటగిరీలో బుస్సాపురం రమ్యశ్రీ రెడ్డి జాతీయస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారని చెప్పారు. విద్యతో పాటు క్రీడల్లో విద్యార్థుల్ని ప్రతిభావంతులుగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. క్రీడల్లో రాణించడం ద్వారా విద్యార్థుల్లో సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల కమిటీ అధ్యక్షుడు దేవినేని మల్లికార్జునరావు, పాలకవర్గ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ, ఫిజికల్ డైరెక్టర్ రావిపాటి చంద్రమోహన్ విద్యార్థినుల్ని అభినందించారు.

రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తున్న ప్రధాని



కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహిస్తున్న ఐక్య నాయకులు

నెహ్రూనగర్: దేశ సంపదను కార్పొరేట్ల పరం చేస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ రాజీనామా చేయాలని ఆల్ ఇండియా క్రిస్టియన్ యూత్ అసోసియేషన్ వ్యవస్థాపక(ఐక్య) అధ్యక్షుడు డాక్టర్ గోళ్లమూడి రాజసుందరబాబు డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ విధానాలకు వ్యతిరేకంగా శుక్రవారం నగరంపాలెం మూడు బొమ్మల సెంటర్ నుంచి చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్‌కు అధిపతి అయిన భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్మును నూతన పార్లమెంట్ భవన ప్రారంభోత్సవానికి ఆహ్వానించకుండా, తానే ప్రారంభించి రాజ్యాంగ పరమైన పెద్ద తప్పిదానికి ప్రధాని మోదీ పాల్పడ్డారని ఆరోపించారు. రాజ్యాంగాన్ని ఉల్లంఘించిన ఆయన వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన మహిళ అయిన భారత రాష్ట్రపతిని ప్రపంచ దేశాల ముందు చిన్నబుచ్చి, గిరిజనుల మనోభావాల్ని ప్రధాని దెబ్బతీశారని తెలిపారు. ఇది అట్రాసిటీ చట్టం కింద నేరమని పేర్కొన్నారు. అనంతరం నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుతో పాటు ఆర్డీవో కార్యాలయం ఇన్‌చార్జ్ అయిన అసిస్టెంట్ కలెక్టర్ శివ నారాయణకు వినతి పత్రం అందజేశారు.

సీఎంకు ఏపీ ఎన్జీవో నేతల కృతజ్ఞతలు

గుంటూరు మెడికల్: కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ, సీపీఎస్ రద్దు, ఏపీవీవీపీ ఉద్యోగులకు 010 పద్దు కింద జీతాలు చెల్లించడం, 12వ పీఆర్సీ కమిటీని నియమించేందుకు నిర్ణయం తీసుకోవడాన్ని స్వాగతిస్తూ శుక్రవారం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని ఏపీ ఎన్జీవో నేతలు తాడేపల్లిలో మర్యాదపూర్వకంగా కలసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏపీ ఎన్జీవో గుంటూరు జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు, కార్యదర్శి శెట్టిపల్లి సతీష్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ నాగూర్ షరీఫ్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరం



వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులతో దేవానంద్, ఝాన్సీలక్ష్మి

గుంటూరు ఎడ్యుకేషన్: అరండల్‌పేటలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శుక్రవారం వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు. లూడో, చెస్, బిజినెస్, వైకుంఠపాళి తదితర ఆటలు ఆడించారు. పేపర్ ఆర్ట్స్, డ్రాయింగ్, క్రాఫ్ట్స్, స్పోకెన్ ఇంగ్లిష్ అంశాల్లో 35 రోజుల పాటు జరిగిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు వివిధ రకాల పోటీల్ని నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్ మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు కార్యక్రమాన్ని 11న నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉప గ్రంథ పాలకురాలు కె.ఝాన్సీలక్ష్మి, సిబ్బంది చిన్నపరెడ్డి, పర్వీన్ సుల్తాన్, అచ్చమ్మ పాల్గొన్నారు.

పాఠశాలల బస్సులకు ఫిట్‌నెస్ తప్పనిసరి



మాట్లాడుతున్న షేక్ కరీం, పక్కన అధికారులు

పట్నంబజారు: ఫిజికల్ ఫిట్‌నెస్ లేకుండా పాఠశాల బస్సులు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని డీటీసీ షేక్ కరీమ్ చెప్పారు. స్వర్ణభారతీనగర్‌లోని ఆర్టీవో కార్యాలయంలో శుక్రవారం పాఠశాల, కళాశాలల యజమానులు, డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీసీ షేక్ కరీం మాట్లాడుతూ చిన్నారుల భవిష్యత్తు డ్రైవర్ల చేతుల్లో ఉందన్న విషయాన్ని గుర్తించాలన్నారు. పూర్తిస్థాయిలో నిబంధనలకనుగుణంగా పాఠశాలల బస్సులు నడపాలని స్పష్టం చేశారు. మూడు మాసాలకొకసారి డ్రైవర్‌కు వైద్య పరీక్షలతో పాటు, పూర్తి స్థాయిలో ఫిట్‌నెస్ కలిగి ఉండాలని తెలిపారు. ప్రతి బస్సులో అత్యవసర ద్వారం, ప్రథమ చికిత్స బాక్సు, తప్పనిసరిగా అటెండరు ఉండాలని సూచించారు. సమావేశంలో ఎంవీఐలు గోపాల్, తోట రాఘవరావు, సౌజన్య పాల్గొన్నారు.

పీఎం కిసాన్ పథకానికి ఈకేవైసీ తప్పనిసరి



ఈకేవైసీ విధానాన్ని పరిశీలిస్తున్న పద్మావతి

పెదనందిపాడు: పీఎం కిసాన్ పథకానికి ప్రతి ఒక్కరూ ఈకేవైసీ చేయించుకోవాలని అగ్రికల్చర్ కమిషనరేట్ డెప్యూటీ డైరెక్టర్ పద్మావతి తెలిపారు. మండలంలోని ఉప్పలపాడు, నాగులపాడు గ్రామాల్లో శుక్రవారం ఆమె పర్యటించారు. రైతులతో మాట్లాడారు. 14వ విడత పీఎం కిసాన్ పథక నిధులు ఖాతాల్లో జమ అవ్వాలంటే ప్రతి ఒక్కరూ ఈకేవైసీ చేయించుకోవాలని ఆమె చెప్పారు. గతంలో వేలిముద్ర, ఓటీపీ పద్ధతిన చేసేవారన్నారు. ఇప్పుడు పేస్ రికగ్నిషన్ (ముఖ చిత్రం) కూడా అందుబాటులోకి వచ్చినట్లు ఆమె తెలియజేశారు. ఆమె వెంట ఏవోలు సరిత, సుధారాణి, సిబ్బంది ఉన్నారు.

నాలుగు హైస్కూళ్లకు నూతన ప్రధానోపాధ్యాయులు

ప్రత్తిపాడు: మండలంలోని నాలుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో నూతన హెచ్‌ఎంలు బాధ్యతలు స్వీకరించినట్లు మండల విద్యాశాఖాధికారి సీహెచ్.రమాదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇనుమెట్ల హైస్కూలు నుంచి బదిలీపై వచ్చిన హరిదాసు శ్రీనివాస్ ప్రత్తిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా, కోయవారిపాలెం హైస్కూలు హెచ్‌ఎంగా పెద్ది విజయలక్ష్మి, గొట్టిపాడు హైస్కూలు హెచ్‌ఎంగా వడ్డేపాటి చంద్రశేఖర్‌రావు, చినకోండ్రుపాడు హైస్కూలు హెచ్‌ఎంగా జంపాల విజయ్‌కుమార్‌లు మండలానికి బదిలీపై వచ్చారు. వీరు ఆయా పాఠశాలల్లో విధుల్లో చేరినట్లు ఎంఈవో పేర్కొన్నారు. కాగా పాతమల్లాయపాలెం, తిక్కిరెడ్డిపాలెం హెచ్‌ఎంల పాఠశాలలు కూడా బదిలీ అయినప్పటికీ ఆయా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఆధారంగా హెచ్‌ఎం పోస్టులు ఇవ్వలేదని ఎంఈవో కార్యాలయ వర్గాలు తెలిపాయి.

పొన్నూరు ఏడీఏగా రామకోటేశ్వరి

చేబ్రోలు: పొన్నూరు వ్యవసాయ సబ్ డివిజన్ సంచాలకులు (ఏడీఏ)గా వి.రామకోటేశ్వరి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. బాపట్ల డీఏవో కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఆమె బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ ఏడీఏగా పనిచేసిన సీహెచ్ తిరుమలాదేవిని గుంటూరులోని టెస్టింగ్ ల్యాబ్‌కు బదిలీ చేయడంతో ఆమె రిలీవ్ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన రామకోటేశ్వరి మాట్లాడుతూ సబ్ డివిజన్ పరిధిలోని రైతులకు అందుబాటులో ఉంటానన్నారు. ప్రభుత్వ పథకాల్ని వారికి సకాలంలో అందిస్తూ, వ్యవసాయ రంగాభివృద్ధికి సహకరించనున్నట్లు తెలిపారు.

మెగా అవుట్‌రీచ్ క్యాంపెయిన్‌కు స్పందన

కొరిటిపాడు: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ కార్యాలయం మెగా అవుట్‌రీచ్ క్యాంపెయిన్ గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లోని క్యాపిటల్ హోటల్‌లో శుక్రవారం నిర్వహించారు. సమావేశంలో గుంటూరు రీజియన్‌లోని శాఖలకు చెందిన సుమారు వంద మంది కస్టమర్లు పాల్గొన్నారు. సీఏఎస్ఏ, రిటైల్ వ్యవసాయం, ఎంఎస్ఎంఈ, డిజిటల్ ఉత్పత్తుల గురించి బ్యాంకు అధికారులు వివరించారు. సమావేశానికి ముంబాయి సెంట్రల్ కార్యాలయం జనరల్ మేనేజర్ వికాస్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జోనల్ కార్యాలయం డెప్యూటీ జోనల్ హెడ్ మురళీ పార్థసారథి, గుంటూరు రీజనల్ హెడ్ కుందన్‌లాల్‌లు మాట్లాడారు. సమావేశంలో రీజనల్ కార్యాలయం, గుంటూరు నగరంలోని బ్రాంచీల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

లారీ ఇంజిన్‌లో మంటలు.. దగ్ధం



గుంటూరు రూరల్: ఇంజిన్‌లో మంటలు వ్యాపించడంతో ఇసుక లారీ దగ్ధమైన సంఘటన శుక్రవారం నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం... తాడేపల్లి వైపు నుంచి చిలకలూరిపేట వైపుకు వెళుతున్న ఇసుక లోడు లారీ ఎన్‌హెచ్ 16లో బుడంపాడు వద్దకు రాగానే ఇంజన్‌లో మంటలు వ్యాపించాయి. దీంతో లారీని రోడ్డు పక్కకు నిలిపి వేసి డ్రైవర్, క్లీనర్ దిగిపోయారు. వెంటనే గమనించిన రక్షక్ పోలీసులు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించడంతో సిబ్బంది సంఘటన స్థలికి చేరుకుని మంటల్ని ఆర్పివేశారు. ప్రమాదంలో ఎవరికీ హాని జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

తాగి వాహనం నడిపినందుకు జరిమానా

గుంటూరు లీగల్: తాగి వాహనం నడిపిన వ్యక్తికి గుంటూరు ఆరో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కొల్లి శృతవింద శుక్రవారం రూ.10 వేలు జరిమానా విధించారు. గుంటూరు ఈస్ట్ ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఈ నెల 6వ తేదీన ఈస్ట్ ట్రాఫిక్ పోలీసులు గుంటూరు వన్‌టౌన్ పరిధిలోని నందివెలుగు రోడ్డులో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. ఆ సమయంలో పాత గుంటూరుకు చెందిన షేక్ జానీబాషా మద్యం తాగి బైక్ నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డాడు. నిందితుడ్ని శుక్రవారం కోర్టుకు హాజరుపర్చగా తన నేరాన్ని అంగీకరించాడు. దీంతో న్యాయమూర్తి నెల రోజులు జైలు లేదా రూ. 10 వేలు జరిమానా కట్టాలని తీర్పు చెప్పారు. దీంతో నిందితుడు రూ.10 వేలు జరిమానా చెల్లించాడు.

ప్రత్తిపాడు తహసీల్దార్ సంజీవకుమారి బదిలీ

ప్రత్తిపాడు: స్థానిక తహసీల్దార్ ఎం. లీలాసంజీవకుమారి బదిలీ అయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆమె నకరికల్లు మండలానికి వెళ్లారు. ఆమె స్థానంలో జిల్లా కలెక్టరేట్‌లో విధుల్ని నిర్వర్తిస్తున్న తహసీల్దార్ సిద్ధార్థను ప్రత్తిపాడుకు బదిలీ చేస్తూ జిల్లా ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.